సంపుటము– III
నెం. 1

19 ఆగష్టు 1996
సోమవారము
(శ.క.సం. 1918,
శ్రావణము – 28

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యకలాపములు

## అధికార నివేదిక

## విషయ సూచిక

| | | | |
|---|---|---|---|
| | | | పేజి నెం. |
| 1. | సంతాప ప్రతిపాదన :<br>శాసనసభ సభ్యులు శ్రీ ఎన్. వెంకటయ్యగారి మృతిపట్ల సంతాపము. | : | 1 |

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముద్రణాలయ కమీషనరుగారిచే శాసనసభ ముద్రణాలయము, హైదరాబాదునందు ముద్రించబడినది.

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ యనమల రామకృష్ణుడు |
| ఉప సభాపతి | : | శ్రీ ఎన్. మహమ్మద్ ఫరూక్ |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ బి. గోపాలకృష్ణారెడ్డి |
| | : | శ్రీ ఎం. రాజయ్య |
| | : | శ్రీమతి వై. సీతాదేవి |
| | : | శ్రీ జి. అప్పల సూర్యనారాయణ |
| | : | శ్రీ డి. ఎస్. రెడ్యానాయక్ |
| | : | శ్రీ డి. రాజగోపాల్ |
| ప్రత్యేక కార్యదర్శి | : | శ్రీ సి. వెంకటేషన్ |
| సంయుక్త కార్యదర్శులు | : | శ్రీ బి. సుబ్బారావు |
| | : | శ్రీ ఎస్. డి. కమలాకర్ |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ బి. వి. శర్మ |
| | : | శ్రీ ఎమ్. హెచ్. కేశవరావు |
| | : | శ్రీ కె. తుల్జానందసింగ్ |
| | : | శ్రీ అహమద్ అతావుల్లా |
| | : | శ్రీమతి టి. అంజనిబాయి |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ టి. వి. సత్యనారాయణ |
| | : | శ్రీ కె. వి. డేవిడ్ జ్ఞానకన్ |
| | : | శ్రీ ఎన్. సువర్ణరాజు |
| | : | శ్రీ ఖాజామొయినుద్దీన్ |
| | : | శ్రీ ఆర్. బాస్కరన్ |
| | : | శ్రీ లైకూర్ రెహమన్ అన్సారి |
| | : | శ్రీ ఆర్. అంజయ్య |
| | : | శ్రీ సయ్యద్ అహమద్ |
| | : | శ్రీ ఎస్. వి. రామిరెడ్డి |
| | : | శ్రీమతి వి. జయకుమారి |
| | : | శ్రీమతి ఇందిరాగాంధీ |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ సి. కాశిరాజు |

ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు

అధికార నివేదిక

(పదవ శాసనసభ)

(ఎనిమిదవ సమావేశము : మొదటి రోజు)

---

సోమవారము, 19 ఆగష్టు, 1996

---

(సభ ఉదయం 11-00 గంటలకు సమావేశమైనది)

(ఉప సభాపతి అధ్యక్ష స్థానములో వున్నారు)

## సంతాప ప్రతిపాదన

## శాసనసభ సభ్యులు శ్రీ ఎన్. వెంకటయ్యగారి మృతిపట్ల సంతాపము

శ్రీ ఎన్. చంద్రబాబునాయుడు:- అధ్యక్షా, "పదవ శాసనసభ సభ్యులు శ్రీ నందారం వెంకటయ్యగారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సానుభూతిని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నది".

అధ్యక్షా, కొడంగల్ శాసనసభ్యులు శ్రీ నందారం వెంకటయ్యగారి మరణం పట్ల నా ప్రగాఢ సానుభూతిని, విచారాన్ని తెలియజేస్తున్నాను. ముప్పది సంవత్సరాలపాటు రాజకీయ జీవితంలో వున్న వెంకటయ్యగారు ధైర్యంగా ముందుకుపోతూ ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. ఆయన నిష్కలంక రాజకీయవేత్త అని తెలియజేసుకుపోతూ ఎన్నో కార్యక్రమాలు కొండగల్ నియోజకవర్గ సమస్యలపైన మంచి అవగాహన గల శాసనసభ్యులు ఆయన. అందరితో మిత్రులుగా వుంటూ, స్నేహభావంతో అనేక కార్యక్రమాలను వారు చేపట్టడం జరిగింది. అదే విధంగా ప్రజలకు సేవ చేయాలనే వున్నత భావంతో ఎప్పుడూ ముందుకు వచ్చేవారు. ఆ విధంగా వారు నాకు ఎన్నో సంవత్సరాలుగా పరిచయం. ఆయన అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిటల్‌లో చేరడం జరిగింది. ఆయన 63 సంవత్సరాల వయసులో, ఆగష్టు 11, 1996, తెల్లవారు జామున 'నిమ్స్' లో మరణించిన విషయం తెలియజేసుకుంటున్నాను. వారు ఆసుపత్రిలో వున్నప్పుడు నేను వెళ్ళి చూడడం జరిగింది. ఆయన ఆసుపత్రిలో కూడా చాలా ఉల్లాసంగా కనబడేవారు. డాక్టర్లు కదలవద్దని చెప్పినా వినకుండా, ఆయన టిడిపి లెజిస్లేచర్ పార్టీ సమావేశానికి వచ్చి తమ సూచనలను యివ్వడం జరిగింది. నాకు జనార్దన్‌రెడ్డిగారు వచ్చి "ఆయనకు సీరియస్‌గా వుంది. రోజులలోనే వుంది ఆయన జీవితం" అని చెప్పినప్పుడు నేను ఎంతో బాధపడడమే కాకుండా డాక్టర్లను ఎలర్ట్ చేయడం జరిగింది. డాక్టర్లు ఎంతో ప్రయత్నం చేసినప్పటికీ ఆయన మననుండి దూరమయ్యారనే విషయం తెలియజేసుకుంటున్నాను.

నందారం వెంకటయ్యగారు 1972లో మొట్టమొదటిసారిగా ఎం.ఎల్.ఏగా ఎన్నికైనారు. 1985లో ఒకసారి, తిరిగి 1994లో మరొకసారి ఎం.ఎల్.ఏగా ఆయన ఎంపిక

---

*An asterisk before the name indicates confirmation by the Member.

కావడం జరిగింది. ఆయన 1933 సంవత్సరంలో జన్మించారు. ఆయన తన 33వ సంవత్సరంలో నందారం గ్రామ సర్పంచ్ కావడం జరిగింది. ఆయన పెద్దగా చదువుకోక పోయినా కామన్ సెన్స్‌తో, సామాన్యప్రజానీకానికి ఏవిధంగా సేవచేయాలనేది ఆలోచించి, ఆ విధంగా ఎంతో ఉత్సాహంతో ముందుకుపోయేవారని తెలియజేసుకుంటున్నాను. రాజకీయంగా ఆయన ఎన్నో పదవులను అలంకరించారు. 1965 నుండి 1967 వరకు భూమి తనఖా బ్యాంకు అధ్యక్షునిగాను, 1969 నుండి 76 వరకు జిల్లా గ్రంధాలయ సంస్థ అధ్యక్షులుగాను, 1971 నుండి 1972 వరకు మార్కెటింగ్ కమిటీ అధ్యక్షునిగాను, 1971 నుండి 1976 వరకు పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ సభ్యులుగాను ఆయన వ్యవహరించారు. ఆరోజుల్లో కొడంగల్ నియోజకవర్గం వెనుకబడి వుండేది. ఎక్కువగా ఎడ్యుకేషనల్ యిన్‌స్టిట్యూషన్ లేవు. అందువల్ల ఆయన పెద్దగా చదువుకోలేకపోయారు. అయినప్పటికీ ఆయన చదువుకోసం ఎంతో కృషి చేశారని తెలియజేసుకుంటున్నాను. 1965లో ఆయన ఓరియంటల్ ఎడ్యుకేషన్ సొసైటీని స్థాపించి, 25 సంవత్సరాల కాలం ఆయన ఆ సంస్థ చైర్మన్‌గా, కార్యదర్శిగా వున్నారు. ఈ సంస్థ ద్వారా ఒక ఓరియంటల్ కళాశాల, ఒక సంస్కృత పాఠశాల, కెజి పాఠశాల స్థాపించి నిర్వహించారు. ఆ విధంగా ఆయనకు పెద్దగా చదువులేకపోయినా, విద్యాభివృద్ధికోసం పాటుపడుతూ వెనుకబడిన నియోజకవర్గ అభివృద్ధికోసం నిర్విరామ కృషి చేస్తూ నన్ను ఎప్పుడు కలిసినా నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలను గురించి మాట్లాడేవారు. అటువంటి ఒక మంచి వ్యక్తి మనందరికీ దూరం కావడం జరిగింది. మా పార్టీ తరఫున నా బాధను వ్యక్తం చేస్తున్నాను. మా శాసనసభ్యులలో ఆయన చాలా ఎల్డర్లీగా వుండేవారు. ఏదైనా క్రైసిస్ వచ్చినప్పుడు ఆయన మమ్ములను ముందుకు పోవలసిందిగా ధైర్యం చెబుతూ ముందుకు నడిపించేవారు. అటువంటి వ్యక్తి యొక్క మరణం పట్ల నేను నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు, మిత్రులకు అందరికీ నా సానుభూతిని తెలియజేసుకుంటూ, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పి. జనార్ధన్‌రెడ్డి (ఖైరతాబాద్) :– అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

నందారం వెంకటయ్యగారు 1933లో మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించారు. వారు ప్రాథమిక విద్యవరకు చదువుకొని, తన తండ్రికి సహాయపడాలనే వుద్దేశంతో వ్యాపారంలో ప్రవేశించారు. వారు తక్కువగా చదువుకున్నప్పటికీ, వేరే వారికి చదువులో లోటు వుండరాదనే వుద్దేశంతో 1965లో ఓరియంటల్ ఎడ్యుకేషన్ సొసైటీని స్థాపించి, ఆ సంస్థకు అధ్యక్షులుగా 25 సంవత్సరాల కాలం వున్నారు. ఓరియంటల్ కళాశాల, సంస్కృత పాఠశాల, కెజి పాఠశాల నడిపించడం జరిగింది. వారికి ఎడ్యుకేషన్ ఎక్కువగా లేకపోయినా ఎడ్యుకేషన్ విషయంలో వారు ఎక్కువ శ్రద్ధ కనపరచారు. వెనుకబడిన ప్రాంతాన్ని విద్యారంగంలో అభివృద్ధి చేయాలనే వుద్దేశంతో ఎడ్యుకేషన్ సొసైటీ స్థాపించి విద్యాభివృద్ధికి దోహదం చేశారు.

అధ్యక్షా, వారు 1965 నుండి 67 వరకు భూమి తనఖా బ్యాంకు అధ్యక్షునిగాను, 1971 నుండి 72 వరకు మార్కెటింగ్ కమిటీ అధ్యక్షునిగా వున్నారు. 1972 లో వారు మొట్టమొదటిసారిగా రాష్ట్ర శాసనసభ్యునిగా ఎంపిక అయినారు. ఈ తరువాత 1985 సంవత్సరంలోను, 1994 సంవత్సరంలోను మొత్తం మూడు సార్లు శాసనసభ్యునిగా ఎంపిక కాబడ్డారు. వారు తెలుగుదేశం పార్టీ సభ్యుడు అయినప్పటికీ యితరపార్టీల సభ్యులతో కలిసిమెలిసి వుండేవారు. మేము ప్రసంగించేటప్పుడు పరస్పర గౌరవ భావంతో వుండేవారము. వారు ఆగష్టు 11, 96 నాడు 'నిమ్స్'లో క్యాన్సర్ వ్యాధితో మరణించారు. తోటి శాసనసభ్యుని పోగొట్టుకున్నందుకు నాకెంతో బాధగా వుంది.

ముఖ్యంగా, ముఖ్యమంత్రిగారితో మనవి చేసేది ఏమంటే, కొంతమంది ఎంఎల్‌ఏలు చనిపోయినప్పుడు, ఆ కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితి ఎంతో దయనీయంగా వుంటోంది. కుటుంబ సభ్యులు ఎన్నో యిబ్బందులకు గురి కావడం జరుగుతోంది. స్వర్గీయ బత్తిన సుబ్బారావుగారి సతీమణి, కుటుంబ సభ్యులు ఎన్నో యిబ్బందులను ఎదుర్కొంటున్నారు. అందువల్ల రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటు చేసి, ఎంఎల్‌ఏల నుండి డబ్బు కలెక్టు చేసి, దివంగత శాసనసభ్యుల కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేస్తే బాగుంటుంది. ముఖ్యంగా అధ్యక్షులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మనవి చేస్తున్నాను.

శ్రీ వెంకటయ్యగారి మరణం పట్ల మా పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా సానుభూతిని తెలుపుకుంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

11.10 ఉ. శ్రీ సిహెచ్. విఠల్‌రెడ్డి (నర్సాపూర్):- అధ్యక్షా, పూజ్యులు వెంకటయ్యగారు నిరాడంబర జీవి. ఆయన నిస్వార్థ సేవతో తన జీవితం గడిపారు. మూడుసార్లు శాసనసభ్యునిగా ఎన్నికయినారు. ఆయన సర్పంచ్‌గా కూడా ఎన్నిక కావడం జరిగింది. ఆయన చాలా విద్యాసంస్థలను స్థాపించారు. 30 సంవత్సరాల రాజకీయ జీవితంలో నిస్వార్థంగా పని చేయడం, రైతుల కొరకు, పేదల కొరకు, బలహీనవర్గాల కొరకు ఎన్నో త్యాగాలు చేసి పని చేశారు. నాకు వారితో చాలా కాలంగా పరిచయం వుంది. వారు శాసనసభ్యులుగా అందరితో కలుపుగోలుగా వ్యవహరించేవారు. వారి మరణం పట్ల మా పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ పి. రామయ్య (నిడుమోలు):- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను. వెంకటయ్యగారు మూడు దఫాలు శాసనసభ్యులుగా వున్నారు. అప్పటినుండి వారు నాకు తెలుసు. ఆయన చాలా నిరాడంబరుడు. ఆయన యువకులకు ఆదర్శప్రాయంగా వుంటూ ఎంతో కృషి సలిపారు. క్రింది స్థాయి నుండి, వివిధ స్థాయిలలో నాయకుడుగా, ప్రజాసేవకుడుగా ఆయన గుర్తింపు పొందారు. ఏదైనా ఒక విషయం చర్చించేటప్పుడు ఆయన తన వుద్దేశాన్ని ఎంతో

దృఢంగా చెప్పేవారు. వారు నిర్వహించిన పాత్ర మాకు, యువతరానికి ఆదర్శప్రాయంగా వుండగలదని నేను ఆశిస్తున్నాను. వారి మరణం పట్ల మా పార్టీ తరఫున, నా తరఫున జోహార్లు అర్పిస్తూ సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ సిహెచ్. విద్యాసాగరరావు (మెట్‌పల్లి):- అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి మద్దతు తెలుపుతున్నాను.

మనతోటి శాసనసభ్యులు శ్రీ వెంకటయ్యగారు ఈనాడు లేకుండా పోయారు. శాసనసభ్యునిగా అతను ఏ పార్టీకి చెందినవాడైనప్పటికీ, అన్ని రాజకీయపార్టీల శాసనసభ్యులతో ఎంతో సంతోషంగా, స్నేహపూర్వకంగా వుండేవారు. ఎన్నో సందర్భాలలో కమిటీలలో జరిగిన చర్చల సందర్భంగా ఆయన తన భావాలను చాలా స్పష్టంగా ప్రకటించడమే ఆయన తన భావాలను చాలా స్పష్టంగా ప్రకటించడమే కాకుండా, తాను వ్యతిరేకించే ఏ అంశమైనా నిర్ద్వంద్వంగా ఖండించిన సందర్భములను నేను ఎన్నోసార్లు చూడడం జరిగింది. శాసనసభ్యుడుగా, రాజకీయ నాయకుడుగా మాత్రమే కాకుండా, ప్రజాసేవకుడుగా కూడా ఆయన వ్యవహరించారు. ఆయన ఆధ్యాత్మిక చింతనతో వుండేవారు. ఆయన మాటలద్వారా, వేషభాషల ద్వారా ఆయొక్క ఆధ్యాత్మిక చింతన ప్రస్ఫుటం అయ్యేది. తోటి శాసనసభ్యుని అకాల మరణం పట్ల మా పార్టీ తరఫున, వారి కుటుంబానికి మా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాము.

شری محمد امان اللہ خان: - چیف منسٹر صاحب نے آج اسمبلی میں مسٹر این۔ وینکٹیا صاحب کے انتقال پر تعزیتی قرارداد پیش کئے ہیں میں اسکی بھرپور تائید کرتا ہوں۔ آج ہمارے ایک ساتھی کی کمی ہوئی ہے۔ جیسا کہ ابھی معلوم ہوا کہ تعلیم کے تعلق سے بہت زیادہ دلچسپی رکھتے تھے۔ انھوں نے تعلیم حاصل نہیں کئے تھے اس کمی کو وہ بہت زیادہ شدت سے محسوس کرتے تھے۔ انکی جتنی بھی تعریف کیجائے بہت کم ہے۔ ایسے انسان دنیا میں بہت کم پیدا ہوتے ہیں۔ ایسے لوگوں کی کمی ہو رہی ہے۔ چیف منسٹر صاحب نے جو قرارداد پیش کئے ہیں میں اور ہماری پارٹی اسکی بھرپور تائید کرتا ہوں۔

శ్రీ వై. కిష్టారెడ్డి (కల్వకుర్తి):- అధ్యక్షా, గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాపతీర్మానాన్ని బలపరుస్తున్నాను.

కీర్తిశేషులు నందారం వెంకటయ్యగారి మరణం వల్ల మన రాష్ట్రం, ప్రత్యేకించి మా జిల్లా ఒక మహా నాయకుడిని కోల్పోయిందని తెలియజేస్తున్నాను. వారు మొదట గ్రామ సర్పంచ్‌గా వుండి, తదుపరి శాసనసభ్యునిగా మెట్టు మెట్టుగా ప్రజాభిమానంతో ఎదిగిన మహానాయకులు, వారు మొదట స్వతంత్ర అభ్యర్థిగా తదుపరి రెండు పర్యాయాలు తెలుగుదేశం పార్టీ సభ్యునిగా శాసనసభకు ఎన్నిక కావడం జరిగింది. వారు చాలా నిరాడంబరులు, నిజాయితీపరులు. ఏ సమావేశంలో అయినప్పటికీ, ఎవరు ఉన్నప్పటికీ తాను చెప్పదలుచుకున్నదాన్ని, మాట్లాడదలుచుకున్న దాన్ని ధైర్యంగా చెప్పగలిగిన వ్యక్తి ఆయన అని మనవి చేస్తున్నాను. పెద్దలు చెప్పినట్లుగా వారు చదువుకోకపోయినా విద్యాసంస్థలను స్థాపించి, జిల్లా స్థాయిలో విద్యాభివృద్ధికి శ్రద్ధ తీసుకోవడం జరిగింది.

సంతాప ప్రతిపాదన: శాసనసభ సభ్యులు 19 ఆగష్టు, 1996

శ్రీ ఎన్. వెంకటయ్యగారి మృతిపట్ల సంతాపము.

నేను మొట్టమొదటిసారిగా శాసనసభ్యునిగా ఎన్నిక అయిన తరువాత అనేక సమావేశాల్లో వారితోబాటు పాల్గొనే అవకాశం కలిగింది. వారు నాతో ఎంతో స్నేహంగా వుండేవారు. మా జిల్లా మంత్రిగారితో ఎంతో ప్రేమతో మైత్రితో వ్యవహరించే వెంకటయ్యగారు, జిల్లాలో ఏమైనా పనులు ఆలస్యంగా జరిగినప్పుడు, అన్యాయాలు జరిగినప్పుడు విమర్శలు చేస్తూ, సూచనలు కూడా చేసేవారు. గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పినట్లుగా వారి అంతిమ దశలో వారిని కలిసినప్పుడు, ఈ మధ్య ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను పునరాలోచన చేసి పేద ప్రజానీకానికి, రైతాంగానికి సహాయపడాలని కోరడం జరిగింది. వారు ఆర్య వైశ్య సంఘ ప్రధాన కార్యదర్శిగా ఆ సంఘానికి ఎనలేని సేవలు చేశారని, ఆ సంఘానికి సంబంధించిన వారు, ఆయన గురించి గొప్పగా చెప్పడం జరిగింది. వారు ఎంతో ఆదర్శంగా, నిజాయితీగా, నిరాడంబరంగా గ్రామాభివృద్ధి కోసం, గ్రామ ప్రజల సమస్యలను అర్థం చేసుకొని మంచి సూచనలు, సలహాలు యిచ్చేవారు. అటువంటి మహానాయకుడిని మనం కోల్పోయాము.

నేను వెంకటయ్యగారి మరణం పట్ల తీవ్రమైన బాధను వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి నా సంతాపాన్ని తెలియజేస్తూ, ఈ అవకాశం యిచ్చిన తమకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎన్. జనార్ధన్‌రెడ్డి:- అధ్యక్షా, పూజ్యులు వెంకటయ్యగారి మరణం పట్ల గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ నందారం వెంకటయ్యగారు కొడంగల్ నియోజకవర్గంలోని నందారం గ్రామంలో 1935లో జన్మించారు. వారు గ్రామ సర్పంచ్‌గా, మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా, భూమి తనఖా బ్యాంకు అధ్యక్షునిగా రాజకీయాల్లో ప్రవేశించి 1972లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఎం.ఎల్.ఏ గా ఎన్నికయ్యారు. 1985 లోను, 1994 లోను తెలుగుదేశం సభ్యునిగా ఎన్నికయినారు. ఆయన తన నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తూ, బడుగువర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారు. దానికి నిదర్శనం వారి దశదిన కర్మనాడు పేదవారు భోజనానికి వచ్చి అశ్రుతర్పణం గావించడం జరిగింది. కొడంగల్ మా జిల్లాలో బాగా వెనుకబడిన నియోజకవర్గం. వారు ఎప్పుడు ఏ సమావేశంలో మాట్లాడినా ఆ నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడే వారు. వారు నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తిత్వం కలవారు. ఆయనకు ఆరోగ్యం బాగా లేకపోయినా, డాక్టర్లు వద్దన్నా, లెజిస్లేచర్ పార్టీ మీటింగ్ జరుగుతూ వుంటే, తన నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురావడం కోసం వచ్చి వెళ్ళడం జరిగింది. వెంకటయ్యగారి స్వగ్రామంలో ఒక
11-20 దేవాలయం ఉంది. దానిని తిరుపతిలోని వెంకటేశ్వరస్వామి దేవాలయానికి
ఉ. అనుగుణంగా డెవలప్ చేసేందుకు ఆయన అహర్నిశలు కృషి చేశారు. ఎక్కడ ఏ

మీటింగ్‌లో కలిసినా, "మనవడా" అని ఒక తాత పిలిచినట్లుగా నన్ను పిలిచేవారు. పర్సనల్‌గా నేను ఒక తాతను కోల్పోయినట్లుగా బాధపడుతున్నాను. ఆయన ఆలోచించిన అభివృద్ధి కార్యక్రమాల అమలుకు మేము అందరం కృషి చేస్తామని మనవి చేసుకొంటున్నాను. వారి మరణం మా జిల్లాకే కాకుండా, రాష్ట్రానికి కూడ తీరని లోటు. వారి కుటుంబ సభ్యులకు, వారి మిత్రులకు నా సానుభూతిని వ్యక్తం చేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ ఆర్. చంద్రశేఖర్‌రెడ్డి (వనపర్తి):- అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ఈ రోజు మా జిల్లా శాసనసభ్యులైన శ్రీ నందారం వెంకటయ్యగారి అకాల మరణం పట్ల సానుభూతి వ్యక్తం చేస్తూ, ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ వెంకటయ్యగారు మా జిల్లా ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు, శాసనసభ్యులుగా ఉన్నప్పుడు, మా జిల్లాకు సంబంధించిన సమస్యల పరిష్కారం కొరకు ఆయన దగ్గరకు వెళ్లినప్పుడు, ఆ సమస్యల్ని హైదరాబాద్ వరకు తీసుకొని వెళ్లి పరిష్కరించేవారు. ఆ విధంగా నేను జిల్లాలో గుర్తింపు పొందే అవకాశం ఆయన నాకు కల్పించారు. ప్రభుత్వం ఏ పనులు అయినా చేయించుకోవాలని ఆయన దగ్గరకు వెళ్లితే, ఆయన దగ్గర ఉండి ఆ పనుల్ని చేయించేవారు. ఒకవేళ, ఆలస్యం అయితే, మమ్మల్ని వెళ్లిపోమని చెప్పి, ఆయన పట్టుదలతో అక్కడే ఉండి పనులు చేయించేవారు. నిజంగా ఈరోజు మేము ఒక పెద్ద దిక్కును కోల్పోయినట్లు భావిస్తున్నాం. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, 1995 ఆగష్టు 12వ తేదీన జడ్చర్ల శాసనసభ్యులు ఎర్ర సత్యం చనిపోతే, 1996 ఆగష్టు 11వ తేదీన వెంకటయ్యగారు చనిపోవడం మా జిల్లా ప్రజలు, మేము చాల బాధపడుతున్నాం. మా పార్టీ కార్యకర్తలు, ప్రజానీకం దిగ్భ్రాంతికి గురైన సందర్భం ఇది. ఆయన చనిపోయినపుడు ఆయన గ్రామానికి వెళ్లితే, అక్కడ పెద్ద సంఖ్యలో పేద వాళ్లు తరలి వచ్చారు. దానిని బట్టి తెలుస్తున్నది ఆయనకు పేదవాళ్లతో ఉన్న అటాచ్‌మెంట్. పేద వాళ్ల సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉన్నవారు. He has a total grip over the administration in that area. అంత మంచి పరిపాలనా దక్షత కల్గినవారు. ఈరోజు మా జిల్లాలో ఆయన లేని లోటు బాగా కనిపిస్తున్నది.

ఆయనకు కొన్ని నిర్దిష్టమైన ఆలోచనలు, కోర్కెలున్నాయి. ఇది సందర్భం అవునో, కాదో తెలియదు కాని... out of inexperience, I am putting my request with the Hon'ble Chief Minister. ఆయన తన చివరి రోజుల్లో తన నియోజకవర్గానికి ఒక ఆర్.టి.సి. డిపో కావాలని ముఖ్యమంత్రిగారిని కోరారు. సి.ఎం.గారు కూడ ఆలోచిస్తామని అన్నారు. నాకు నమ్మకం ఉంది వారు దానిని అమలుపరుస్తారని. డిపో కొరకు వెంకటయ్యగారు ఎంతో కాలం నుండి కృషి చేసినందువల్ల, అక్కడ ఒక డిపోను ఏర్పాటు చేసినట్లయితే, వారి మృతికి నిజంగా మనం ఒక నివాళి అర్పించినట్లు అవుతుంది. ఆయన నిమ్స్ ఆసుపత్రిలో ఉండగా, నేను వెళ్లి చూసినప్పుడు, డిపో సంగతి ఏమైంది, ఆర్డర్సు ఇచ్చారా అని అడిగారు. ఈ సందర్భంగా నేను వినమ్రంగా వేడుకొంటున్నాను త్వరలో అక్కడ డిపో ఏర్పాటు చేయాలని.

సంతాప ప్రతిపాదన: శాసనసభ సభ్యులు 19 ఆగష్టు, 1996
శ్రీ ఎన్. వెంకటయ్యగారి మృతిపట్ల
సంతాపము.

అట్లాగే, వారి నియోజకవర్గంలో ఆయన అనుకొన్న పనులన్నింటిని ముఖ్యమంత్రిగారి ఆశీస్సులతో, వారి నియోజకవర్గ పరిధిలోకి వచ్చే అన్ని గ్రామాల్లో అమలుపరిచి, ఆయన ఆశయసిద్ధికి కృషి చేయగలమని ఈ వేదిక ద్వారా మీకు తెలియచేసుకొంటున్నాను. ఆయన లేని లోటు ఎవరూ తీర్చలేరు. అయినా, ఆయన తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాల్ని అమలు చేసేందుకు అవసరమైన బలాన్ని ఆశీస్సుల్ని ముఖ్యమంత్రిగారు కల్పించాలని కోరుతున్నాను.

అట్లాగే, వి. జనార్ధన్‌రెడ్డిగారు చెప్పినట్లు రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటు విషయం స్పీకర్‌గారి దృష్టిలో ఉంది. ఏ శాసనసభ్యుడు అయినా తన పదవీ కాలంలో చనిపోతే, శాసనసభ్యుల కాంట్రిబ్యూషన్‌తో ఒక రివాల్వింగ్ ఫండ్‌ను ఒక దానిని ఏర్పాటు చేసి, అందులో నుండి కొంత మొత్తాన్ని చనిపోయిన శాసనసభ్యుల కుటుంబ సభ్యులకు అందచేసి, ఆదుకోవాలనే ఆలోచన చాల సముచితమైన నిర్ణయం. దానిని వెంటనే కార్యరూపంలోకి వచ్చే విధంగా ముఖ్యమంత్రిగారు శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నాను. 1972వ సం.లోనే వెంకటయ్యగారు శాసనసభ్యుడు అయినప్పటికీ, ఇప్పటికీ వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నది. కాబట్టి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని ఈ సందర్భంగా మనవి చేసుకొంటూ, వెంకటయ్యగారి అకాల మరణం పట్ల విచారం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేసుకొంటున్నాను.

శ్రీ కె. మధుసూధనరావు (కొల్లాపూర్):- గౌరవనీయులు ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, మా జిల్లాలో అందరికంటే సీనియర్ నాయకుడు, నాకు తాతతో సమానుడైన శ్రీ నందారం వెంకటయ్యగారి అకాల మరణం పట్ల నా బాధను వ్యక్తం చేస్తున్నాను.

శ్రీ వెంకటయ్యగారు 1993వ సంవత్సరంలో దౌలతాబాద్ మండలం, నందారం గ్రామంలో జన్మించారు. ఆయన చిన్ననాటి నుండే రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటూ, భూమి తనఖా బ్యాంక్ అధ్యక్షుడుగా, సర్పంచ్‌గా అనేక పదవులు అలంకరించి, వారి నియోజకవర్గంలోని అట్టడుగున ఉన్న బడుగు, బలహీనవర్గాల అభిమానాన్ని సంపాదించుకొని, 1972 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. ఆ తరువాత, 1985, 1994 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. వారి రాజకీయ చరిత్రలో ఒక గొప్పదనం ఏమిటంటే, రాజకీయాల్లో ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా, ఎం.ఎల్.ఏ.గా ఉన్నా, లేకపోయిన తనను నమ్ముకున్న ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, సేవ చేసేవారు. వెంకటయ్యగారు మరణించిన రోజున ఉదయం 11 గంటలకు మాకు ఆ వార్త తెలిసింది. నేను, చంద్రశేఖర్‌రెడ్డిగారు మహబూబ్‌నగర్‌లో ఉంటే మాకు ఆ సమాచారం అందింది. తక్షణమే, మేము మా కార్యక్రమాల్ని రద్దు చేసుకొని, కొడంగల్‌కు వెళ్ళాం. అక్కడి వాతావరణం

మాస్తే, ఒక చంటిబిడ్డ తన తండ్రిని పోగొట్టుకొంటే ఎట్లా రోధిస్తుందో, ఆ విధంగా అక్కడి కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి, రోధిస్తూ, తమ బాధను వ్యక్తం చేయడం జరిగింది. మేము మా నాయకుడిని పోగొట్టుకొన్నాం, మాకు ఇక ఎవరు దిక్కు అని ప్రజలు చెప్పుకోవడం జరిగింది. రాజకీయాల్లోకి కొత్తగా వచ్చే వారికి ఆయన ఒక మార్గదర్శి. ఎందుకంటే, ఎం.ఎల్.ఏ.గా గెలిచినా, ఓడినా, తనను నమ్ముకున్న ప్రజలకు సహాయం చేసేవారు. తాను చెప్పదలచుకొనేది నిర్మొహమాటంగా చెప్పేవారు. అటువంటి వ్యక్తి ఈ రోజు మన మధ్య లేకపోవడం చాల బాధాకరం, తీరని లోటు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు అర్పిస్తూ, సెలవు తీసుకొంటున్నాను.

11.30 ఉ. శ్రీ ఎల్లారెడ్డి (మక్తల్):- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని సంపూర్ణంగా బలపరుస్తున్నాను. నందారం వెంకటయ్యగారు అపారమైన రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తి. చాలా కాలం నుంచి నాకు బాగా తెలిసిన వ్యక్తి. నా నియోజకవర్గం వారి నియోజకవర్గానికి ప్రక్కన ఉండటమే కాకుండా, మా మండలాలలో వారికి కొన్ని గ్రామాలు కూడా వున్నాయి. ఇద్దరమూ కూడా అయా మండలాల అభివృద్ధికి కృషి చేశేవాళ్లం. వెంకటయ్యగారు చాలా కాలం నుంచి రాజకీయాలలో వుంటూ, సర్పంచి నుంచి బ్లాండు మార్కెటింగు సమితి ప్రెసిడెంటు, మార్కెటింగు కమిటీ ఛైర్మన్ నుంచి శాసనసభ్యునిగా ఎదిగి, ప్రజలకు సేవ చేస్తూ వచ్చిన మనిషి. ప్రజలు ఆర్థికంగా ఎదగడానికి, నియోజకవర్గంలో వుండే గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన వ్యక్తి. వెంకటయ్యగారు సాధారణ జీవితాన్ని గడపిన వ్యక్తి. నిరాడంబరుడు, ప్రజల మనిషి. తలపాగా చుట్టుకుని రైతుల ప్రతినిధిగా మనకు కనిపించేవారు. ఈ రోజు వారు లేకపోవడం రాష్ట్రానికి, ప్రత్యేకించి మా జిల్లాకు, అందులోనూ ప్రత్యేకించి, నా వంటి వారికి తీరని లోటు. తన అపారమైన రాజకీయ అనుభవంతో నాకు సరైన సలహాలు యిస్తూ వుండేవారు. అది ఎన్నటికీ నేను మరువలేను. మంచి పరిపాలనా దక్షత కలిగిన వ్యక్తి ఈ రోజు లేకపోవడం నిజంగా శోచనీయం. ప్రభుత్వంలోనూ, ఆర్థిక కార్యక్రమాలలోనూ తీసుకురావలసిన సంస్కరణలను గురించి ముఖ్యమంత్రిగారికి తెలియజేయాలని వారు ఆసుపత్రిలో వున్నప్పుడు కూడా ఆలోచిస్తూ, నేను వారిని పరామర్శ చేయడానికి వెళ్లినపుడు ప్రస్తావించారు. ఆసుపత్రిలో, మరణశయ్యపై వుండి కూడా రాష్ట్రాభివృద్ధి కోసం, ఆర్థికాభివృద్ధి కోసం తపించిన వ్యక్తి ఆయన. అటువంటి వ్యక్తి ప్రస్తుతం లేకపోవడం రాష్ట్రానికి, ప్రత్యేకించి నాకు చాలా లోటు. వారి మరణం పట్ల నా ప్రగాఢ సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు, మిత్రులకు తెలియజేస్తున్నాను.

శ్రీ పి. రాములు (అచ్చంపేట):- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, వెంకటయ్యగారి మృతి మా జిల్లాకు తీరని లోటు అని తెలియజేస్తున్నాను. అంచెలంచెలుగా వారు రాజకీయాలలో ఎదిగి శాసనసభ్యునిగా

శ్రీ ఎన్. వెంకటయ్యగారి మృతిపట్ల
సంతాపము.

ఎన్నికైన, ఎంతో అనుభవాన్ని గడించిన శ్రీ వెంకటయ్యగారు వయసులో మాకందరి కంటే పెద్దవారు. అటువంటి రాజకీయానుభవం కలిగిన వ్యక్తిని కోల్పోవడం మా జిల్లా దురదృష్టం. వారు ఏ సమావేశంలో మాట్లాడినా ఎంతో ఆలోచనతో, తన అభిప్రాయాలను ఎంతో నిక్కచ్చిగా, దాపరికం లేకుండా చెప్పి, అధికారులను ఆదేశిస్తూ, త్వరతగతిని పనులు పూర్తి కావాలని, వెనుకబడిన తమ జిల్లాకు అభివృద్ధికార్యక్రమాల విషయంలో ఎంతో పాటుపడిన వ్యక్తి. వారిని ఆదర్శంగా తీసుకుని, రాజకీయాలలోకి కొత్తగా వచ్చిన మేము వారి సలహాలను తీసుకునే వారము. జిల్లా అభివృద్ధి కోసం వారు ఆవేదన పడుతూ, ముఖ్యంగా కోడంగల్ ప్రాంతంలోని బడుగు, బలహీనవర్గాల, మైనారిటీల అభివృద్ధి కొరకు తపించేవారు. వారి దహన సంస్కారాల సమయంలో వచ్చిన ప్రజానీకాన్ని చూస్తే ఆయనపట్ల ప్రజలకుండే గౌరవభావం తెలుస్తుంది. గౌరవనీయులైన, దయామయులైన ముఖ్యమంత్రిగారు, వెంకటయ్యగారి కడసారి కోరిక అయిన కోడంగల్ బస్సు డిపోను మంజూరు చేస్తారని నమ్ముతున్నాము. వారికి ఆత్మశాంతి కలగాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ జి. బుచ్చయ్య చౌదరి (రాజమండ్రి):- అధ్యక్షా, రాజకీయ నాయకులంతా దోపిడిదారులుగా, దొంగలుగా భావింపబడుతున్న ఈ రోజులలో రాజకీయం అంటే సంఘ సేవ అని నమ్మి, నిజమైన సంఘసేవకునిగా, శ్రేయోభిలాషిగా కృషి చేసిన మిత్రులు శ్రీ వెంకటయ్యగారు నిరాడంబరులు, సాధుస్వభావులు. అటువంటి వ్యక్తి మరణం నిజంగా బాధాకరం. వెనుకబడిన మహబూబునగరు జిల్లాయొక్క సమస్యల పరిష్కారానికి నిజాయితీగా కృషి చేసిన మహా వ్యక్తి వెంకటయ్యగారు. సమస్యల పట్ల స్థిరమైన అభిప్రాయం కలిగిన వారాయన. అధికార పక్షంలో వుండి అన్నిటికీ చేతులెత్తేవాడు కాడాయన. తప్పు అని అనిపిస్తే వేలెత్తి చూపి, సరిచేయాలన్న ఆలోచన కలిగిన వ్యక్తి ఆయన. నేను ప్లానింగుబోర్డు డెప్యూటీ ఛైర్మన్‌గా వున్నపుడు, వెనుకబడిన తన జిల్లాకు ప్రాధాన్యత కలిగేలా చూడాలని, వారు కోరేవారు. వారిని వెంటపెట్టుకుని ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావుగారి వద్దకు తీసుకువెళ్లి, వారి సమస్యల మీద అవగాహన కల్పించడం కోసం ఎంతో ప్రయత్నం చేయడం జరిగింది. వారు మితభాషి. తన సుదీర్ఘ రాజకీయ అనుభవాన్ని తన నియోజకవర్గ అభివృద్ధి కొరకు వెచ్చించిన మహా వ్యక్తి ఆయన. వారి మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ కె. బాపిరాజు (అత్తిలి):- అధ్యక్షా, మన వెంకటయ్యగారు మృతిచెందడం పట్ల ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, అటువంటి మహా మనిషిని పోగొట్టుకున్నామంటే, సహజంగా ఎవరైనా బాధపడతాం. పుట్టిన ప్రతివారూ గిట్టక మానరు. ముఖ్యంగా బాధపడేది, ఆయన యొక్క వ్యక్తిగత క్యారెక్టరు, వారి సింప్లిసిటీ గురించి. ఈనాడు ముఖ్యమంత్రిగారు చెప్పినట్లు వారి పార్టీతోనూ, మిత్రపక్షాలతోనూ వెంకటయ్యగారికి మంచి సంబంధాలున్నాయి. కేవలం మిత్రపక్షాలతోనే కాకుండా,

11.40 ఉ. ప్రతిపక్షంలోని మాలాంటి వారితో కూడా ఆత్మీయతగా వుండేవారు. పి.యు.సి కమిటీలో సభ్యులుగా వుండి, ఆయన మాట్లాడే మాటలు చాలా నిర్మొహమాటంగా, స్పెసిఫిక్‌గా ఏది చెప్పాలో, అక్షరాలా తు. చ తప్పకుండా ఆయన చేప్పేది పూర్తిచేయకుండా వుండేవారు కారు. ఆయన మాటలు స్వచ్ఛం, ఆలోచనలు స్వచ్ఛం. నిజంగా ఆఖరు రోజున చనిపోయే ముందు కూడా పార్టీపట్ల విశ్వాసంతో హాస్పిటల్ వదిలివెళ్లి ఆయన భావాలు చెప్పాలనే ఉద్దేశ్యం చెప్పారంటే చాలా కన్విక్షన్ గల వ్యక్తి. అటువంటి మనుషులను వాడుకోవాలి. నేను 78 లో ఎం.ఎల్.ఏగా ఉన్నప్పుడు చెప్పాను. ఎం.ఎల్.ఏ మరణించగానే సానుభూతి పలకడమే కాకుండా ఎం.ఎల్.ఏగా వున్న వ్యక్తిని వాడుకోవాలని చెప్పాను వారి ప్రియారిటీ తీసుకోని మంచి సంస్థలలో అవకాశం ఇవ్వాలి. అంటే మంత్రి పదవే కాదు, పార్టీపరంగా మంచి పదవి, ఏపార్టీ అయినా ఈరోజుల్లో, ఏదన్నా పోజీషన్ కావాలంటే, కులం, నోరు వున్నవాడు, కావలసిన వాడు తప్ప క్యారక్టరీ కన్విక్షన్ వున్నవాళ్లకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ఇది చాలా దురదృష్టకరం. దయచేసి ఇటువంటి వ్యక్తిని గురించి మాట్లాడే ముందు, అటువంటి వ్యక్తులను వాడుకొనే ఆలోచన రావడం చాలా మంచి పరిణామం. శ్రీ బుచ్చయ్యచౌదరి చెప్పినట్లుగా వారికి మంచిపేరు వుంది. ఎం.ఎల్.ఏగా వారికి ఎంత ప్రఖ్యాతి వుందంటే, వారు చనిపోతే మహబుబ్‌నగర్‌లోని వారి కానిస్టిట్యుయెన్సీలో బాధపడ్డ విధం చూస్తే ఇంత మంచివ్యక్తి పోయాడు అని నెమరువేసుకోవలసిన బాధ్యత వుంది. సానుభూతి తీర్మానాలతో సరిపెట్టుకొని కుటుంబానికి సానుభూతి తెలిపితే రాజకీయపార్టీ బాధ్యత తీరిపోతుందని భావించకూడదు. మంచి వ్యక్తులను సమాజంలో ఉపయోగించుకొనే అవసరం ఉందని మరొకసారి తమద్వారా ఈ శాసనసభకు తెలియజేస్తున్నాను. చంద్రశేఖర రెడ్డిగారు ప్రపోజ్ చేసినట్లు రివాల్వింగ్ ఫండ్ పెడితే బాగుంటుంది. ఉద్యోగస్థులు, కార్మికులు ఇటువంటి ఫండ్ పెట్టుకుంటున్నారు. ఇచ్చిన ప్రతిపాదన మంచిదే. అయితే ఆ సూచన ప్రపోజల్‌తోనే సరిపోతుంది తప్ప కనీసం జి.ఓ.లు కూడా ఇంప్లిమెంట్ చేసుకొనే స్థితిలో మనం లేము. జనరల్‌గా జి.ఓ.లు ఇస్తున్నాము గానీ ఇంప్లిమెంట్ చేసే పరిస్థితి లేదు. కేవలం సానుభూతి మాటలతో కాకుండా దీనిని స్టార్ట్ చేయాలి. 5 ఏండ్లు మనం ఎం.ఎల్.ఏలుగా వుంటున్నాము కాబట్టి ఒక నెల జీతం డిక్లేర్‌చేస్తే బాగుంటుంది. ఈ కార్యక్రమం ప్రారంభించడానికి తొలిసారిగా ఒక నెలజీతం రివాల్వింగ్ ఫండ్ క్రింద విరాళంగా ప్రకటిస్తున్నానని ఈ సభాముఖ్యమంగా తెలియజేస్తూ, తోటి శాసనసభ్యులు కూడా చేస్తే బాగుంటుందని చెబుతున్నాను. మా సి.ఎల్.పి. లీడర్, మాపార్టీ శాసన భ్యులందరూ ఈవిధంగానే ఒక నెల జీతం ఇవ్వడానికి సిద్ధంగా వున్నారని తెలియజేస్తున్నారు. ఇక ముఖ్యమంత్రిగారిని కోరేది ఏమిటంటే, వెంకటయ్యగారు ఏదో కార్యక్రమం తలపెట్టాడు అన్నారు.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్:- ఇది ఎమినిటీస్ కమిటీలో డిస్కషన్‌కు వచ్చింది. చంద్రశేఖర్‌గారు ప్రపోజ్ చేశారు. దానిగురించి బి.ఏ.సిలో డిస్కస్ చేద్దాము.

శ్రీ కె. బాపిరాజు:- నేను కూడా లెజిస్లేచర్ మినిస్టరుగా చేశాను. ప్రతిపాదన పెట్టారు. స్పార్ట్ చేస్తున్నారు అన్నారు, సంతోషం. ఇక వారు ఆఖరుక్షణం వరకూ డిపోకావాలని తపన పడ్డారు. దానిని ముఖ్యమంత్రిగారు పూర్తి చేస్తారనే విశ్వాసం నాకు ఉంది. అదే మనం ఆ నియోజకవర్గానికి ఇచ్చే సానుభూతి అవుతుందని తెలియజేస్తూ, ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ ఎన్. రాఘవ రెడ్డి (నకిరేకల్):- అధ్యక్షా, వెంకటయ్యగారు మాతోపాటు ఒకటి రెండు సందర్భాలలో కమిటీలలో ఉండడం జరిగింది. పూర్తిగా నిరాడంబరులు. అలాగే కొంత సేవాభావం కలిగిన వ్యక్తి. కొన్ని విలువలు పెంచాలనే పద్ధతి వున్నవారు. అటువంటి వ్యక్తి మరణించడం నిజంగా చాలా బాధాకరమయిన విషయం. ఒకవిధంగా సమాజం నష్టపోయిందని చెప్పవచ్చు. అందుకని అట్లాంటివారి మరణం పట్ల మాపార్టీ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి కుటుంబానికి సంతాపం తెలియజేస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ కె. సుబ్బరాజు (విజయవాడ-పడమర):- అధ్యక్షా, గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. మన అందరికీ కూడా ఎంతో ప్రేమపాత్రుడుగా వుండి ఇటీవల పరమపదించిన నందారం వెంకటయ్యగారికి మాపార్టీ తరఫున సానుభూతి తెలియజేస్తున్నాను. అలాగే వారిలో ఒక ప్రత్యేకత సంతరించుకొన్నది. వారు ఒక రాజకీయపార్టీకి చెందినవారయినా నాకున్న పరిమితమయిన పరిచయంతో వారిని చివరిసారిగా ఈనెల 2, 3 తేదీలలో విజయవాడ నగరం హౌస్‌కమిటీతో వారు రావడం జరిగింది. దాంట్లో వారు పార్టిసిపేట్ చేసినతీరు గమనించి, నిష్పక్షపాతమయిన వ్యక్తి అపారమయిన అనుభవం ఉన్నవ్యక్తిగా ఆయనను అర్థం చేసుకొన్నాను. సమస్యల పట్ల సమగ్రమయిన అవగాహనతో ఏ విషయంలో కూడా రాజీ లేకుండా వ్యవహరించే వ్యక్తిని ఈ శాసనసభ కోల్పోవడం దురదృష్టకరం అని భావిస్తున్నాను. వారు విజయవాడ నగరానికి వచ్చిన సందర్భంగా కనకదుర్గమ్మను సందర్శించాలని కోరితే, ప్రత్యేకంగా ఆనాటి హౌస్‌కమిటీ తరఫున పైకి పంపడం జరిగింది. కొంత అనారోగ్యంగా వారు ఉండడం గమనించి హౌస్‌కమిటీ ఛైర్మన్‌గా వున్న భరతసింహా రెడ్డిగారు వారికి వాహనం ఇచ్చి జాగ్రత్తగా హైదరాబాద్ పంపడం జరిగింది. ఇంతలో ఇటువంటి దురదృష్టకరమయిన వార్త వింటామని అనుకోలేదు. అటువంటి మంచి వ్యక్తులు ఈ సమాజానికి చాలా అవసరం. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకొంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ వంక సత్యనారాయణ (పెనుగొండ):- అధ్యక్షా, వెంకటయ్యగారి మరణానికి మన ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని హృదయపూర్వకంగా బలపరుస్తున్నాను. వెంకటయ్యగారితో నా పరిచయం 1972 లో ఆయన స్వతంత్ర అభ్యర్థిగా గెలిచినప్పుడు. అప్పుడు ఆనాటి ప్రతిపక్షంలో వున్న మాతో ఆయన సహచర్యం, అలాగే నియోజకవర్గంలో

వుండే సమస్యలు, ముఖ్యంగా షాబాద్ రాళ్ళగురించి నియోజనవర్గంలో జరుగుతున్న అన్యాయాలను గురించి మాద్వారా ప్రశ్నలు వేయించడం, అనేక ఇతర ప్రజాహిత కార్యక్రమాల విషయంలో ఇద్దరం సంప్రదించుకొని అసెంబ్లీలో యాక్ట్ చేసేవారం. ఈ సంవత్సరం ఆయన, నేను కూడా పి.యు.సి కమిటీలో సభ్యులుగా వున్నాము. ఆయన రెగ్యులర్‌గా ఎన్నో విషయాలలో పాల్గొంటూ వుండేవారు. ముఖ్యంగా ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో వున్న ఫ్రాడ్ గురించి, రెప్ట్ గురించి చాలా నిర్మొహమాటంగా డిపార్ట్‌మెంట్ అఫీషియల్స్‌ను నిలబెట్టి అడుగుతుండేవారు. ఆయన రైతు పక్షపాతి. అలాగే ముఖ్యంగా ఎక్కువ దైవభక్తి కలవారు. ఆయన నా నియోజకవర్గం హెడ్‌క్వార్టర్స్ పెనుగొండలో వైశ్యుల దేవాలయం వాసవి కన్యకా పరమేశ్వరికి. వచ్చి సందర్శించడం, రాష్ట్ర వైశ్య మహాసభలకు ప్రధానకర్తగా వుండి మంచి కార్యక్రమాలకు పూనుకొంటూ వుండేవారు. ఎం.ఎల్.ఏగా ప్రజాహిత కార్యక్రమాలు అమలుజరిపి, వాలంటరీగా రైతు పక్షపాతిగా ఎన్నో విషయాలతో చక్కగా ప్రవర్తించిన నాయకుడు, అటువంటి నాయకుడిని కోల్పోవడం నిజంగా దురదృష్టకరం. వారి కుటుంబానికి, అలాగే వారి హితులకు, ఆ

11.50 ఉ. జిల్లా పెద్దలకు అందరికీ కూడా త సందర్భంలో నా సానుభూతిని తెలియపరుస్తూ, ఈ అవకాశాన్ని ఇచ్చినందుకు నమస్కరిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎం.ఎ. గఫూర్ (కర్నూలు):— అధ్యక్షా, పెద్దలు శ్రీ వెంకటయ్యగారి మృతిపట్ల మా పార్టీ తరఫున తీవ్రమైన సానుభూతిని, విచారాన్ని ప్రకటిస్తున్నాను. వెంకటయ్య గారితో నేను శాసన సభ్యుని కాక ముందు నాకు పరిచయం లేదు. కాని ఈ ఒకటిన్నర సంవత్సరాలలో నేను వారితోపాటుగా పి.యు.సి.లో ఒక మెంబరుగా ఉంటూ ఆయన నుంచి నేను ఎంతో స్ఫూర్తిని పొందానని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. ఎందుకంటే, కేవలం సి.ఎ.జి. రిపోర్టుల మీదనే ఆధారపడకుండా, ప్రభుత్వ రంగ సంస్థల యొక్క పని తీరుపై, ప్రతి చిన్న విషయాన్ని, లోపాలను తన అనుభవం ద్వారా ఎత్తి చూపుతూ ఆ సంస్థలు సరిదిద్దుకోడానికి చక్కటి సలహాలను ఇచ్చేవారు. నిర్మొహమాటంగా ఏ విషయాన్నైనా చెప్పడంతోను, లోపాలను ఎత్తి చూపడంలోనూ ఆయన అనుభవం మాకు ఎంతో తోడ్పడుతుందని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

ఆయన ఎంతో నిస్వార్థమైన ప్రజా సేవకుడు. ఒక అధికారి పార్టీ శాసన సభ్యుడిని అనే డాబు, దర్పం, అధికారం లేకుండా చాలా నిరాడంబరంగా మస్లేవారు. వయస్సు రీత్యా ఆయనకు, మాకూ తేడా ఉన్నప్పటికీ, చిన్న వయసు గల శాసన సభ్యులతో ఎంతో స్నేహంగా, ప్రేమ భావంతో మెలుగుతూ, తెలియని విషయాలు ఎన్నో చెప్పి, ఆవిధంగా శాసన సభలో ప్రశ్నలు వేయాలని చెప్పేవారు.

ఆయన రాజకీయ అభిప్రాయాలు చాలా స్పష్టమైన విధానంలో ఉండేది. మేము ఆగష్టు మొదటి వారంలో ఓరియంటేషన్ క్లాస్సులకు వెళ్ళాము. అప్పుడు పెద్దలు వెంకటయ్యగారు అనారోగ్యంతో ఉన్నారు. నేరుగా నిజాం ఆసుపత్రి నుంచి ఢిల్లీకి రావడం జరిగింది. ఓరియంటేషన్‌క్లాసులలో మాతోపాటు పాల్గొన్నారు. 'గాట్ ఒప్పందం' గురించి.

అందువల్ల వచ్చే నష్టాల గురించి కమ్యూనిస్టు పార్టీలవారు ఏ పద్ధతిలో చెబుతారో ఆ రకంగా ఒక రకమైన స్పష్టమైన అభిప్రాయంతో 'గాట్'ను వ్యతిరేకించాలని మాకు వచ్చిన ప్రొఫెసర్‌గారితో అర్గ్యూ చేయడంతో ఆయన రాజకీయ అభిప్రాయాలు ఎంత పట్టుదలతో స్పష్టంగా ఉన్నాయో తెలుస్తుంది.

ఒక సందర్భంలో ఆయన లెజిస్లేచర్ – ఎగ్జిక్యూటివ్‌ల అధికారాలను గూర్చి మాట్లాడుతూ, లెజిస్లేచర్ మీద క్రమంగా ఎగ్జిక్యూటివ్ ఓవర్ పవర్ చేస్తున్నది. దానిని మనం శాసన సభలో లేవదీయాలని చెప్పేవారు. స్పష్టమైన రాజకీయ అభిప్రాయాలతో ప్రజాసేవకు అంకితమైన వ్యక్తిగా ఆయనను చూసాం. ఆయననుంచి మేము ఎంతో నేర్చుకోవలసి ఉంది. ఆయన మరణానికి తీవ్రమైన సంతాపాన్ని వ్యక్తం చేస్తూ నేను సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ బద్దం బాల్ రెడ్డి (కార్వాన్) :– అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ సంతాప తీర్మానాన్ని మా పార్టీ తరఫున నేను బలపరుస్తున్నాను. మహనీయులు వెంకటయ్యగారు 3 సార్లు శాసన సభకు ఎన్నికైన వ్యక్తి. మారుమూల గ్రామంలో సర్పంచ్‌గా ఎన్నుకోబడి తరువాత శాసన సభకు 3 సార్లు సభ్యునిగా ఎన్నుకోబడ్డారు. ఆయన ఒక నిరాడంబరమైన, పెద్ద మనసు కల పెద్ద మనిషి. ఒక శాసన సభ్యునిగా మాతోపాటు ఒక దశాబ్దం నుంచి కలసి పని చేసిన విషయాన్ని గుర్తుకు తెస్తున్నాను.

రంగారెడ్డి జిల్లాలోని తాండూరుకు ప్రక్కనే ఉన్నది కొడంగల్లు. అప్పుడప్పుడు రంగారెడ్డి జిల్లా విషయాలు కానీ, మహబూబ్ నగర్ జిల్లా విషయాలు కానీ, గ్రామీణ ప్రాంతాలలో జరుగుతున్న అన్యాయాన్ని కానీ చర్చించే ప్రజల మనిషి వారని మీ దృష్టికి తీసుకువస్తున్నాను. అట్టడుగున ఉన్న వర్గాల వారికి సేవా భావంతో, అంకిత భావంతో చిన్నప్పటి నుంచి సేవ చేసిన వ్యక్తి, అది వారు శాసన సభ్యుడు అయిన తరువాత కూడా మరువలేదు. తలపాగా పెట్టి, ఒక సాధారణ మనిషిగా, రైతు బిడ్డగా శాసన సభకు వచ్చిన ఘనత ఆయనకే దక్కిందనే విషయాన్ని గుర్తు చేసుకోవాలి.

నిర్మొహమాటంగా, తాను నమ్మిన విషయం మీద– ప్రభుత్వపరంగా కానీ, అధికార పరంగా కానీ ఏదైన తేడాలుంటే పోరాటం చేసే మనిషి ఆయన. నిజంగా అలాంటి మహా మనిషి శాసన సభకు దూరం కావడంతో రాష్ట్రానికి, ఎంతో హాని కలిగింది. మహబూబ్‌నగర్ జిల్లాకు ఒక పెద్ద మనిషి లేడు అని తలచుకుంటేనే ఎంతో ఆవేదన కలుగుతోంది. ఇంత వరకు జనార్ధన్ రెడ్డిగారు, చంద్రశేఖర్ రెడ్డిగారు, ఇంకా అనేకమంది సోదర శాసన సభ్యులు మరణించిన శాసన సభ్యులకు చేసే ఆర్థిక సహాయం గురించి చెప్పారు. శాసన సభ్యుల రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటు విషయాన్ని ఎమినిటీస్ కమిటీలో ఒక తీర్మానాన్ని పెడుతున్నామని చెబుతున్నాను. స్పీకరుగారి ద్వారా ముఖ్యమంత్రిగారు రివాల్వింగ్ ఫండ్ విషయంలో ఒక నిర్ణయానికి వస్తే బాగుంటుంది. ఎంతో నిస్వార్థంగా, కష్టనష్టాలకు గురయి, నీతి నిజాయితీలతో పనిచేసే శాసన సభ్యుల బ్రతుకులకు, వారి పిల్లలకు ఈనాడు

19 ఆగష్టు, 1996

**సంతాప ప్రతిపాదన: శాసనసభ సభ్యులు శ్రీ ఎన్. వెంకటయ్యగారి మృతిపట్ల సంతాపము.**

ఏరకమైన ప్రగతి సాధిస్తోందో చూస్తున్నాము. వారికి అంతో, ఇంతో సహకారాన్ని కల్పించాలని మీద్వారా కోరుకుంటూ, మరొకసారి వారి ఆత్మశాంతికి భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పి. చంద్రశేఖర్ (మహబూబ్‌నగర్):- ముఖ్యమంత్రిగారు శ్రీ వెంకటయ్యగారి మృతిపట్ల ప్రవేశపెట్టిన తీర్మానాన్ని నేను బలపరుస్తున్నాను. ఆయనతో ఎక్కువ సహచర్యం మా జిల్లాలో అందరికంటే నాకే ఎక్కువగా ఉంది. 1984 తరువాత ఆయన తెలుగుదేశం టిక్కెట్టుపై గెలవడం, 1984 నుండి 1985 వరకు ఆయనతో కలసి పనిచేయడంవల్లనూ, మొన్నటి వరకూ వారితో కలసి ప్రభుత్వ పరంగా బాధ్యతలలో భాగం పంచుకోవడంలోనూ నాకు వారితో చాలా అనుభవం ఉంది. తాను అనుకున్నదాని గురించి ఎవరితో అయినా పోరాడడానికి సిద్ధంగా ఉండేవాడు. రూలింగ్ పార్టీ శాసన సభ్యుడిగా కొంచం మెతక వైఖరితో ఉండాలి అని అనుకున్నవారు కాదు. సమస్య కొరకు ఎవరితో అయినా పోరాడడానికి సిద్ధంగా ఉండేవారు. రాజకీయంతో పాటు ఆధ్యాత్మికపరంగా కూడా సమాజసేవ చేసేవారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మరొక తిరుపతి అన్న విధంగా ఒక వెంకటేశ్వర స్వామి గుడి కట్టి, దానికి ధర్మకర్తగా ఉంటూ ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తూ, ప్రజలలో భక్తి భావాన్ని పెంపొందించేందుకు పాటుపడ్డవారు ఆయన.

ఆయన హైదరాబాదులో ఉంటే అసెంబ్లీకి రావడం, ఊర్లో ఉంటే, గుడి సంగతి చూడడం, ఇవి రెండే పనులు ఆయనకు ప్రధానంగా ఉండేవి. ఆయన లేకపోవడం, ఈరోజు గుడి నిర్వహణకు కూడా ఎంతో లోటును తెస్తుందని భావిస్తున్నాను. అటువంటి మనిషి ఆఖరి క్షణం వరకు ఆయన నియోజకవర్గం, జిల్లా అభివృద్ధి ఎలా చేయాలని తపన పడుతూ చనిపోయారు. ఆయన ఆఖరి కోరిక కొడంగల్‌లో బస్ డిపో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిగారు తప్పకుండా దానికి ఒప్పుకుంటారని భావిస్తూ, వారి ఆత్మ శాంతికి భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరుస్తున్నాను.

ఈ సందర్భంగా బాషీరాజుగారు ఒక మాట అన్నారు. దానిని గురించి నేను రేపో, ఎల్లుండో ఎమినిటీస్ కమిటీలో చెబుదామని అనుకున్నాను కాని ఇప్పుడు చర్చ వచ్చింది కాబట్టి చెబుతున్నాను. గత సెషన్‌లో నేను స్పీకర్ గారికి ఒక లెటర్ ఇవ్వడం జరిగింది. ప్రతి సంవత్సరం ఒక ఎం.ఎల్.ఎ. రు. 4,000/- వెల్ఫేర్ ఫండ్‌కు జమ చేయాలి. మొత్తం 300 మంది సభ్యులున్నారు కాబట్టి అది ప్రతి సంవత్సరం రు. 12.00 లక్షలు జమ అవుతుంది. 5 సంవత్సరాల కాలంలో అది రు. 60.00 లక్షలు అవుతుంది. ఎవరైనా ఎం.ఎల్.ఎ. ఆయన టర్మ్‌లో చనిపోతే, సహజ మరణం కాని, అకాల మరణం కాని, జరిగితే, ఈ ఫండ్ నుండి రు. 5.00 లక్షలు ఇవ్వాలని నేను ప్రపోజ్ చేయడం

12.00 మ. జరిగింది. అందుకు స్పీకర్‌గారు రెండువేల రూపాయలు చేస్తే బాగుంటుందని అన్నారు. కాని రెండు వేల రూపాయలు చాలా తక్కువ వారు చెప్పినట్లు చూస్తే 5 సంవత్సరాలకుగాను 30 లక్షల రూపాయలు అవుతుంది. అది 60 లక్షల రూపాయలయితే బాగుంటుందని నా అభిప్రాయము ఈ స్కీమ్‌లో ఎక్స్ ఎం.ఎల్.ఏలకు చోటు ఉండదు. ఎం.ఎల్.ఏ హఠాత్తుగా చనిపోతే వారి కుటుంబం దిక్కుతోచనివారు అవుతారు. గతంలో పెద్దలు బత్తిన సుబ్బారావుగారు చనిపోయినప్పుడు ఇలా అడగడం జరిగింది. వారి అంతిమ సంస్కార కార్యక్రమాలకు చందాలు వేసుకుని చేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వానికి సంబంధం లేకుండా ఎం.ఎల్.ఏలే తమ జీతాలు, టి.ఏ బిల్స్‌లో సంవత్సరానికి నాలుగువేలు రూపాయల చొప్పున ఒకసారి ఇచ్చినా సరే, లేదా ఆరు నెలలకు ఒకసారి అంటే సంత్సరానికి రెండుసార్లు ఇచ్చినా ఫరవాలేదు. స్పీకర్‌గారు, ఈ ప్రపోజల్ పెట్టినవారు ఎవరయినాసరే వారు జాయింట్ అకౌంట్ మెయిన్‌టెయిన్ చేస్తే సరిపోతుంది. ముఖ్యమంత్రితోబాటు, అన్ని పార్టీల లీడర్స్ ఈ కమిటీ సభ్యులుగా ఉంటారు. ఆగష్టు 1వ తేదీ నుండి ఈ ప్రపోజల్ తీసుకుందామని నేను స్పీకర్‌గారితో చెప్పాను. ఫారెన్ టూర్ వెళుతున్నందున సెప్టెంబర్ 1వ తేదీ నుండి మొదలుపెడదామని వారు చెప్పారు. ఆగష్టు 1వ తేదీ నుండి మొదలుపెట్టినట్లైతే వెంకటయ్యగారి కుటుంబాన్ని ఆదుకున్నట్లయ్యేది. వారి భార్య పెదరికంతో ముసలితనంతో బాధపడుతున్నారు. ఈ బడ్జెట్ సెషన్ అమౌంట్ నుండయినా మనం అంతా కాంట్రిబ్యూట్ చేసుకుని సహాయం చేసే ఆస్కారం ఉంది. నలుగురు సభ్యులు ఈ టర్మ్‌లో చనిపోవడం జరిగింది. అందరికీ వర్తింపచేసినాయినా ఫరవాలేదు. ఈ విషయమై ఎమినిటీస్ కమిటీలో నిర్ణయం తీసుకోమనండి, రూల్స్ తయారు చేయడానికి ప్రయత్నాలు చేయమనండి. సమగ్రంగా తయారు చేసినట్లయితే అందరికీ ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. కాబట్టి ఈ విషయం అందరూ ఒప్పుకుని సంవత్సరానికి నాలుగు వేల రూపాయలు చేయాలని ముఖ్యమంత్రిగారు దీనిని పరిశీలించి అమలుచేయాలని కోరుతున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్:- "ఆంధ్రప్రదేశ్ పదవ శాసనసభా సభ్యులు శ్రీ ఎన్. వెంకటయ్యగారి మరణంపట్ల ఈ సభవారు తమ ప్రగాఢ సంతాపాన్ని వెలిబుస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేస్తున్నారు".

శ్రీ ఎన్. వెంకటయ్యగారు 1972, 1985 మరియు 1994 సం.లలో కొడంగల్ నియోజక వర్గము నుండి శాసన సభకు సభ్యునిగా ఎన్నుకోబడ్డారు. వీరు కొడంగల్ మున్సిపల్ సభ్యునిగా రాజకీయ జీవితం ప్రారంభించి కొడంగల్ మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా ఎన్నికైనారు. వీరు భూమి తనఖా బ్యాంకు అధ్యక్షునిగాను, మార్కెట్ కమిటీ అధ్యక్షునిగా, జిల్లా గ్రంథాలయ సంస్థ సభ్యునిగా అనేక పదవులు నిర్వహించారు.

30 సం.ల పాటు రాజకీయ జీవితం గడిపిన వీరు పెక్కు ధైర్యశాలి, నిష్కళంక రాజకీయవేత్త, స్నేహశీలి అయిన శ్రీ వెంకటయ్యగారు 1996 సం.లో ఆగష్టు 11వ తేదీన మరణించారు. వీరి వయస్సు 63 సం॥లు.

వీరి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిముషముల పాటు మౌనం పాటిద్దాము.

(రెండు నిమిషాలపాటు సభ మౌనం పాటించింది)

The House is adjourned to meet again at 8.30 A.M. tomorrow.

(The House was adjourned at 12.05 P.M. to meet again at 8.30 A.M. on 20th August, 1996.)